క్లుప్తంగా

ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న అనిల్

బైరెడ్డిపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాగు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్‌ను తప్పనిసరిగా చేయించాలని జిల్లా మలేరియా అధికారి అనిల్ అన్నారు. బైరెడ్డిపల్లెలోని పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. కడపనత్తం గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహ కల్పించారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర, సూపర్‌వైజర్ నిరంజన్ పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం


పౌష్టికాహారం అందిస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లి: ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉంటారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. మహతి ఫౌండేషన్ వారి సహకారంతో శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. అలాగే తీర్థం పిహెచ్‌సీలో వైద్యాధికారి అరుణ్‌కుమార్ అవగాహన కల్పించారు. మహతి ఫౌండేషన్ నిర్వాహకురాలు శాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

రొంపిచెర్ల: పౌష్టికాహారంతోనే గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చునని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

14 సీపీఎం ధర్నా


పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

పలమనేరు: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ విధానాలపై ఈనెల 14న సీపీఎం ఆదేశాల మేరకు ఆయా మండల కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు స్థానిక ఆపార్టీ నేతలు గిరిధర్‌గుప్త పిలుపునిచ్చారు. ఆపార్టీ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలసి శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరెంట్ చార్జీలను పెంచబోమని చెప్పిన కూటమి సర్కార్ ఇష్టానుసారంగా చార్జీలను పెంచిందన్నారు. ఇసుక అక్రమాలను కూటమి నేతలే చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన ప్రభుత్వం కేంద్రం దెబ్బకు నోరు మెదపడం లేదన్నారు. ఈశ్వరయ్య, రాజా, రవి, ధనమ్మ పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక సర్వే


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనుల కోసం ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. శనివారం మండలంలోని రాజుపల్లి, పెద్దవెలగటూరు సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనులు తక్షణమే వారి వివరాలను సెల్ఫ్ డిక్లరేషన్ ఫారాలల్లో నింపి పంచాయతీ కార్యదర్శి లేదా వీఆర్వోకు అందజేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సర్వేని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

కోతల జోరు.. యంత్రాల హోరు

- వరి నూర్పిళ్లతో రైతుల హడావుడి
- నూర్పిడి యంత్రాలకు భలే డిమాండ్
- వ్యవసాయ కూలీల దొరక్క ఇబ్బందులు



పలమనేరు: నక్కపల్లి వద్ద వరిని నూర్పిడి చేస్తున్న యంత్రం, (ఇన్‌సెట్) వరి నూర్పిడిలో కూలీలు

పలమనేరు: వ్యవసాయశాఖ డివిజన్‌లో సాగు చేసిన వరికి ఇప్పుడు కోతలు, నూర్పిడులు సాగుతున్నాయి. రైతులు, కూలీలతో వరి పొలాల్లో బిజీగా ఉంటున్నారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. తమిళనాడు రాష్ట్రం నుంచి ఇక్కడికి చేరుకున్న నూర్పిడి యంత్రాలకు భలే గిరాకీ వచ్చింది. డివిజన్‌లో 900 హెక్టార్లలో వరి సాగైంది. ఇందులో 300 హెక్టార్లు కోతకొచ్చింది. మరో నెలలోపు పూర్తిగా వరికోతలు సాగనున్నాయి. వరికోతల కారణంగా ఈ ప్రాంతంలో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎకరా పొలంలో వరి కోతలకు 30 మంది కూలీలు అవసరం పడుతుంది. రోజు కూలీ ధరలు రూ.500 నుంచి రూ.600కి చేరాయి. కూలీలు దొరక్క రైతులు పొరుగున ఉన్న గ్రామాలకు ఆటోలను పంపి కూలీలను పిలిపించుకుంటున్నారు. దీనికి తోడు భోజనం కూడా పెట్టి కూలీ డబ్బులు అందిస్తున్నారు. ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి కూలీలను బుక్ చేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు పంట కోత, నూర్పిడులు చేసేందుకు గుత్తలకు ఒప్పిస్తున్నారు. ఎకరా పొలంలో వరికోతకు గుత్త రూ. 9 వేల నుంచి 10 వేల వరకు ఒప్పందాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ కూలీలకు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు.

4 వేల వరకు అద్దెలు

వరి కోతలకు ఇక్కడ నెలకొన్న డిమాండ్‌ను గమనించి తమిళనాడు రాష్ట్రం నుంచి వరికోత, నూర్పిడి యంత్రాలు పదుల సంఖ్యలో ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. వరిని కోసి, నూర్పిడి చేసే యంత్రానికి గంటకు రూ.4 వేల వరకు అద్దెలు పలుకుతున్నాయి. కూలీల కొరతతో రైతులు యంత్రాలను నమ్ముకుంటున్నారు. దీనికి తోడు పని త్వరగా జరుగుతోంది. ఏటా తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు ఇక్కడికి రావడం జరుగుతోంది.

వర్షాల ప్రభావంతో..

వారం రోజులుగా ఈ ప్రాంతంలో తుపాను ప్రభావంతో మేఘాలు కమ్ముకోవడం, తేలికపాటి వర్షం రావడం జరిగాయి. కానీ రెండు రోజులుగా ఎండ కాస్తుండడంతో వరికోతలకు అనుకూలంగా మారిందని రెతులు చెబుతున్నారు. దీంతో మళ్లీ వానలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిసి వరి కోతలపై రైతులు దృష్టి పెట్టారు.

పంట నేలవాలితే రక్షణ ఇలా..

తుపాను ప్రభావంతో ఇప్పటి వరకు నియోజకవర్గంలో పెద్దగా నష్టం లేనప్పటికీ చిరుజల్లులు, ఈదురుగాలుల కారణంగా అయిదు మండలాల్లో ఎక్కడైనా వరి నేలవాలి పంటకు నష్టం జరిగే అవకాశం ఉంది. నేలవాలిన వరి పంటను ఎలా కాపాడుకోవాలో స్థానిక వ్యవసాయ అధికారులు ముందస్తుగా రైతులకు సూచనలను చేశారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి

నియోజకవర్గంలో విస్తృతంగా వరి పంట సాగైంది. నేలవాలిన వరి పంటలో నీటిని తీసేసి మొలకలు రాకుండా ఉండేందుకు లీటరు నీటికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పంటపై పిచికారీ చేసుకోవాలి. ఇది వరకే పంటను కోసి కుప్పలు వేసిన వారు టార్పాలిన్‌తో చుట్టి పెట్టుకొంటే మంచిది. దీంతో పంటకు నష్టం ఎక్కువగా కాకుండా చూసుకోవచ్చునని అధికారులు సూచించారు.


ముసలిమడుగు వద్ద నేలవాలిన వరి పంట

గుంపులుగా కట్టడం

నేలవాలిన వరిని పైకి లేపి గుంపుగా చేసి కట్టడం ద్వారా సాధ్యమైనంత వరకు పంటకు నష్టం లేకుండా చేసుకోవచ్చు. వర్షాల కారణంగా వరి నేలవాలితే వరిలో 5 దుబ్బలను ఒక్కటిగా చేసి కట్టుకోవాలి. వరి చేలో నీరుంటే చిన్నపాటి కాలువల ద్వారా బయటకు తీసివేయాలని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణదేవీ సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కడపనత్తం విద్యార్థి


మణికంఠతో పీడీ చిరంజీవి

బైరెడ్డిపల్లి: అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి బి.మణికంఠ ఎంపికై నట్లు హెచ్‌ఎం నందగోపాల్‌రెడ్డి, పీడీ చిరంజీవి తెలిపారు. ఈనెల 5న మదనపల్లెలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో మణికంఠ ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా బోగాపురంలో జరిగే అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థి అదృశ్యం


క్రాంతికుమార్

సదుం: కళాశాలకు వెళ్లిన విద్యార్థి కనిపించడం లేదని సమీప బంధువులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండల కేంద్రంలోని కోటగోడసందుకు చెందిన మంజునాథ ఇంటిలో ఉంటూ.. అతని మేనల్లుడు క్రాంతికుమార్ కలికిరిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాలకు అని చెప్పి వెళ్లిన అతను తిరిగీ ఇంటికి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లేక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చినుకు పడితే వణుకే!



ఎంపీడీవో కార్యాలయంలో పెచ్చులూడిన గది పైకప్పు, శిథిలావస్థకు చేరిన ఏడీ కార్యాలయం

- కూలేందుకు సిద్ధంగా ప్రభుత్వ భవనాలు
- భయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పలమనేరు: పలమనేరు పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనాలు కాలం చెల్లాయి. ఇప్పటికే పైకప్పులు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాలకు పై కప్పు నుంచి నీరు ఉరుస్తోంది. ఎప్పుడు కూలుతాయేననే భయం ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బందికి వెంటాడుతోంది. అసలే వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం చాలా వరకు దెబ్బతింది. ఈ భవనం వెనుక వైపు గోడలు బీటలు వారాయి. వర్షంతో పలు గదులు ఉరుస్తున్నాయి. అలాగే వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఏడీ కార్యాలయానికి దక్షిణం వైపు ఉన్న గది కూలింది. దీంతో ఆ గదిలోకి ఎవరూ వెళ్లడం లేదు. దీనికి ఆనుకొని ఉన్న ఏడీ గది, ప్రధాన హాలు కాలం చెల్లి ప్రమాదకరంగా మారింది. దీంతో ఇక్కడికి పక్కనే ఉన్న మరో భవనంలో ఏడీ కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. ఇక సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనం కాలం చెల్లి ఎప్పుడు కూలుతుందోనని భయం పట్టుకుంది.

సైబర్ నేరాలపై అప్రమత్తం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

పలమనేరు: నేటి సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు సీఐ నరసింహరాజు సూచించారు. పట్టణంలోని గంటావూరులో శనివారం ఆయన ప్రజలకు నేడు జరుగుతున్న సైబర్‌నేరాలు, మహిళలపై అత్యాచారాలు, బాలికల కిడ్నాప్‌లను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అపరిచితుల మాటలను చిన్నారులు, మహిళలు నమ్మరాదన్నారు. ఏదేని ఇబ్బంది కలిగితే వెంటనే 100 నంబర్‌కు కాల్‌చేయాలన్నారు. ఇళ్ల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం మేలని సూచించారు. ఎస్‌ఐ స్వర్ణతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం: ఓ మానవమృగం చేతిలో నిలువునా మోసపోయిన బాలికకు శనివారం ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. శాంతిపురం మండలంలోని బాధిత బాలికకు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం అందజేశారు. స్థానిక అధికార పార్టీ నేతలు మనోహర్, జయరాం పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

వి.కోట: ఏపీ అవార్డు టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గంతో సీఎం సహాయనిధికి రూ.లక్ష సీఎం చంద్రబాబునాయుడుకు అందించినట్లు శనివారం కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్ నిర్వహణ కోసం ఆల్ ఇండియా అవార్డ్ టీచర్స్ అసోషియెషన్ ఫౌండర్, అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు సూచనల ప్రకారం ఈ విరాళం అందించినట్లు తెలిపారు. ఈ నిధిని సీఎం కార్యాలయంలో సీఎంకు శుక్రవారం అందించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొటారి వెంకటరత్నం(వి.కోట మండల ఉపాధ్యాయుడు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి ఉన్నారు.

14న మాదిగల ఆత్మీయ సభ

పుంగనూరు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మదనపల్లెలో ఈనెల 14న మాదిగల ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. శనివారం ఆయన మాదిగ ప్రతినిధులతో కలసి పోస్టర్లు విడుదల చేశారు. నరసింహులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణం, వెంకటరమణ , ప్రభాకర్, రాఘవేంద్ర, పెద్దబ్బొడు, రామాంజనేయులు, బాలకృష్ణ, శంకర్, నరసింహరాజ పాల్గొన్నారు.

అపార్ కష్టాలు

- ఆధార్ సవరణలకు నిరీక్షణ
- అఫిడవిట్ కోసం ఇక్కట్లు
- తల్లిదండ్రుల వెతలు


మీసేవా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

కుప్పం రూరల్: అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో 12 అంకెల సంఖ్యతో విద్యార్థుల వివరాలతో భవిష్యత్తు ప్రయోజనాల కోసం ఓ కార్డు తయారు చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కార్డు తయారీ అయితే ఓకే గానీ... అపార్ ఐడీ క్రియేట్ సందర్భంగా జనన ధ్రువీకరణ పత్రం , ఆధార్ కార్డు, తల్లిదండ్రుల వివరాలు అన్ని పత్రాల్లో ఒకే విధంగా ఉండాలి. చాలా వరకు పాఠశాలల్లో ఈ వివరాలు తప్పుల తడకగా ఉన్నాయి. దీంతో పర్మినెంట్ ఐడీ క్రియేషన్‌లో మార్పులు చేసుకోవాలని పాఠశాలల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇస్తున్నాయి. దీంతో మార్పుల కోసం మీసేవ, సచివాలయం, లాయర్ల వద్దకు తల్లిదండ్రులు పరుగులు పెడుతున్నారు. ఒకేసారి అన్ని పాఠశాలల వారు ఈ సమస్యలతో వస్తుండడంతో ఆధార్ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి.

కుప్పం మండల పరిధిలో 117 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 28 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 6,752 మంది బాలురు, 7,373 మంది బాలికలు చదువులు సాగిస్తున్నారు. వీరందరికీ ఆయా ఉపాధ్యాయులు అపార్ ఐడీ క్రియేషన్ చేస్తున్నారు. ఐడీ క్రియేషన్ సందర్భంగా తల్లిదండ్రులు, పిల్లల వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. ఇక్కడే సమస్య తలెత్తుతోంది. మొత్తం 14,125 మంది పిల్లల్లో సగానికి పైగా పిల్లల వివరాలు తప్పుల తడకగా ఉన్నాయి. వీటిని సరి చేయడానికి ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరి చేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు.

అందని సేవలు :

విద్యార్థుల ఆధార్, జనన ధ్రువపత్రాల్లో మార్పులు చేయాలని ఉపాధ్యాయులు తెలియజేయడంతో తల్లిదండ్రులు సవరణల కోసం సచివాలయం, మీ సేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ సర్వర్లు పనిచేయక, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. వీటన్నింటికీ లాయర్ అఫిడవిట్ కావాల్సి రావడంతో అక్కడా నిరీక్షణ తప్పడం లేదు. మండల నలుమూలల నుంచి తల్లిదండ్రులు వస్తుండడంతో ఒకటి రెండు రోజులు ఈ పనికి కేటాయించాల్సి వస్తోంది.

అదును చూసి అధిక ధరలు ..:

పిల్లల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు, చేర్పులకు లాయర్ అఫిడవిట్ కావాల్సి ఉంది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు స్టాంపు పేపర్లు తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. దీన్ని అదునుగా చేసుకుని స్టాంపు వెండర్లు రూ.10 స్టాంపును రూ.50, రూ.20 స్టాంపును రూ.70, రూ.50 స్టాంపును రూ.100, రూ.100 స్టాంపును ఏకంగా రూ.200కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కుప్పం పట్టణంలో రెవెన్యూ స్టాంపులకు డిమాండ్ ఉండడంతో తల్లిదండ్రులు చేసేది లేక అధిక డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అదే విధంగా కొన్ని మీ సేవ, సచివాలయాల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు.

ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అపార్ ఐడీ క్రియేషన్ కోసం పిల్లల రికార్డుల్లో భారీ సంఖ్యలో మార్పులు చేర్పులు చేయాల్సి వస్తోంది. ఇందుకు గాను ప్రభుత్వమే స్పందించి పంచాయతీకో ఆధార్ కేంద్రాన్ని లేక మండలానికి రెండు, మూడు కేంద్రాలను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా ఆయా ప్రధానోపాధ్యాయులకే అధికారం ఇస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సదుం: ఈనెల 14న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ అనంతరం తొలిసారిగా విచ్చేస్తున్న మందకృష్ణ మాదిగకు అందరూ ఘన స్వాగతం పలకాలన్నారు. సమావేశం విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శివయ్య, రామనాథం, మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రకాష్, వెంకటరామయ్య, రత్న, నాగరాజు, గోవింద పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ సిబ్బంది


వృద్ధురాలి కాలి గాయానికి ప్రథమ చికిత్స చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కుప్పం: కుప్పం మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలో 70 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధురాలు బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ వృద్ధురాలి కాలికి బలమైన గాయం అయింది. మాటలు రాని మూగరాలు కావడంతో దెబ్బతగిలిన కాలికి చికిత్స చేసుకోలేక పట్టణంలో గాయంతోనే తిరుగుతూ బిక్షాటన చేస్తోంది. రక్తం, చీము కారుతున్నా నొప్పిని భరించలేక, గాయానికి చికిత్స చేయించుకోలేక నరకయాతన పడుతోంది. ఈ వృద్ధురాలి అవస్థలను కొంత మంది వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చూశారు. ఈ సంఘటనపై మున్సిపల్ కమిషనర్ స్పందించి వృద్ధురాలికి వైద్యం చేయాల్సిందిగా మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. రక్తం, చీము , ఈగలు గాయాన్ని కప్పేసి చూడటానికి అసహ్యం వేస్తున్నా మున్సిపల్ సిబ్బంది వృద్ధురాలి కాలు నుంచి కారుతున్న రక్తం, చీము శుభ్రం చేశారు. గాయం తగ్గేందుకు మందులు వేసి కాలికి కట్టు కట్టారు. మాటలు రాని వృద్ధురాలికి సేవ చేసి మున్సిపల్ సిబ్బంది తమ మానవత్వాన్ని చాటుకున్నారని పట్టణం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా కోనేటిరాయుని కల్యాణం


ఆలయంలో జరుగుతున్న శ్రీకోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: మండలంలో కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. కల్యాణోత్సవం అనంతరం స్వామిపై తలంబ్రాలు కురిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. తరువాత గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్షదీక్షితులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు


గర్భిణికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరం: మండలంలోని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి నెలా 9వ తేదీ నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్త పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతాన్ని తెలియజేశారు. ప్రతి గర్భిణీ రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించి, ఈసీజీ, రక్త పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలోనే సాధ్యమన్నారు. ప్రసవం అయిన వెంటనే జనన ధ్రువీకరణ పత్రం అందజేయడమే కాకుండా రూ.1000 నగదును తల్లి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు, మురళీక్రిష్ణ, చంద్రశేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యాధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

భవితకు మార్గదర్శకాలు ఉపాధ్యాయులే


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

గుడుపల్లె: విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకాలు ఉపాధ్యాయులేనని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శనివారం అగస్త్య ఇంటర్నేషన్ ఫౌండేషన్‌లో 6 రోజులు జరిగిన లీడర్ షిప్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజులు జరిగిన శిక్షణలో ఆశించిన మార్పులు తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు పాఠాలు ప్రయోగాత్మకంగా నేర్పించడం వల్ల మంచి మేధావులు అవుతారన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 150 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని బోధించినప్పడే సమాజంలో మార్పులు వస్తాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలను అందజేశారు. అబ్జర్వర్లు పెంచలకిషోర్, ఇంద్రాణి, ఏజీఎం మంజునాథ్, జీఎం సురేష్ పాల్గొన్నారు.